# వక్రరేఖ

## — న్యూట్రాన్

కలిదిండి సెంటర్లో బస్సు ఆగింది.

దిగుతున్న కొద్దిమందితోపాటు సూటు కేసుతో క్రిందకు దిగాను. బస్సు దుమ్ములేపి హారన్ మ్రోగించుకుంటూ ముందుకు కదలి పోయింది.

సూట్‌కేసును తీసుకొని బయలుదేరాను.

చల్లని సాయంత్రపు వేళ రోడ్డు ప్రక్క కాకాహోటళ్ళలోని రేడియోలు గందరగోళంగా అరుస్తున్నాయి. మేతకు పోయిన పశువులు కాలువ ఈదుకుంటూ అడ్డదిడ్డంగా రోడ్డు ఎక్కుతున్నాయి.

ఉల్లాసంగా వాటిని తప్పించుకుంటూ ముందుకు నడుస్తున్నాను. రోడ్డుకు రెండు వైపులా ఏపుగా పెరిగిన మామిడి తోటలు, వరి పొలాలు, మధ్య మధ్య పంటకాలువలతో ఎటు చూసినా ప్రకృతి పులకరింపజేస్తూంది.

ఎన్నో ఏళ్ళుగా పట్నవాసం అలవాటు కావటంతో చిరపరిచితమైన ఊరయినప్పటికీ, ఏదో వింత అనుభూతిని, మానసోల్లాసాన్ని కలుగ జేస్తూంది.

అందుకే పెదనాన్నగారి వూరు రావట మంటే నాకెంతో యిష్టం. అసలు అన్ని సక్రమంగా జరిగివుంటే నాలుగు నెలల క్రితమే తమ్ముడి పెళ్ళికి రావలసినదాన్ని. కాని, అదే సమయానికి నేను యం. యస్. పరీక్షలకు వెళ్ళవలసి రావటంతో వీలుపడలేదు. తరువాత డిస్పెన్సరీ పని వత్తిడిలో తలమునకలుగా వున్న నాకు తమ్ముడు ఉత్తరాలు వ్రాసినప్పటికీ ఇదిగో అదిగో అంటూ ఇప్పటివరకు తీరిక చిక్కలేదు ఈ ప్రయాణానికి.

ఇదైనా—

'అక్కా !

ఇంతవరకూ ఇదిగో వస్తున్నానంటూ కాలం గడిపావు. ఈసారి అయినా రాకపోతే నీ మరదలు నీతో మాట్లాడనంటూంది సుమా! నీకో అల్లుణ్ణి బహుమతిగా ఇచ్చుకుంటుందట. మరి తప్పక వస్తావు కదూ ?

— నీ తమ్ముడు.'

అంటూ వ్రాయటంతో అన్ని పనులు ప్రక్కకు నెట్టి బయలుదేరక తప్పింది కాదు.

పిల్లకాలువ మీద వంతెన బదులు అడ్డంగా వేసిన తాటిబొత్త మీద అతి జాగ్రత్తగా నడుచుకుంటూ కాలువ దాటాను. ఊరికి చివరగా పంట పొలాల మధ్య పెద్ద నాన్నగారు కట్టించిన ఇల్లు కంటపడగానే అమ్మవడిని చేరిన పిల్లవాడి సంబరంలా నాకెంతో ఆనందాన్ని కల్గించింది.

గాలికి చెదిరిన జుట్టును సరిచేసుకుంటూ సూట్‌కేసును చేయి మార్చుకుని తలుపు తట్టాను.

"ఎవరూ ?..." తలుపు తెరిచింది ఆమె.

గుండ్రటి మొహం. అందమయిన ముక్కు. వెడల్పాటి కళ్ళు. తీర్చిదిద్దినట్లున్న కనుబొమలు. ఒత్తయిన జుట్టు. అందమంతా ఒకేచోట కలబోశారా! అన్నట్లుంది ఆమె.

ఈమెను ఎప్పుడో చూశాను ! ఎక్కడో కలిశాను !!

ఆలోచనలో పడ్డాను —

ఆమె కూడ నా వంక మార్చిమార్చి చూస్తోంది.

"ఎవరమ్మా ! వచ్చింది." అంటూ లోపలి నుంచి ముందు గుమ్మంలోకి వచ్చింది పెద్దమ్మ.

నన్ను చూసిన సంతోషంతో "రా అమ్మా! రా !... ఏమిటలా నిలబడిపోయావు ? ఓహో !.. నీ మరదలును ఇంతవరకు చూడలేదు కదూ ?" అంటూ లోపలికి దారి తీసింది.

ఏదో తెలియని ఆరాటం నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తూంది.

పెద్దమ్మ వేసే కుశల ప్రశ్నలకు జవాబిస్తున్నానే కాని నా ఆలోచనలు నన్ను తరుముతున్నాయి. బిడియపడుతూ ఒక ప్రక్కగా ఒదిగి నుంచుంది ఆమె.

మనసు పొరలను చీల్చుకొని జ్ఞాపకాల దొంతరలు వెదకసాగాను.

మూడు సంవత్సరాల క్రితం —

* * *

"గుడ్ మార్నింగ్ డాక్టర్!" గంభీరమైన గొంతు విని డిస్పెన్సరీలో కూర్చొని మెడికల్ జర్నల్ చదువుతున్న నేను తలఎత్తి చూశాను.

ఎర్రగా పొడుగ్గా హిప్పీ క్రాపుతో మడత నలగని బట్టలతో హుందాగా నిలబడివున్నాడా యువకుడు. షుమారు పాతికేళ్ళలోపు వుంటా యతనికి.

"అయామ్ మిస్టర్ సాగర్ ! షి యీజ్ మై ఉడ్‌బి" అంటూ పరిచయం చేశాడు సిగ్గుతో అతని ప్రక్కనే నుంచుని వున్న ఆమెను.

"ప్లీజ్ టేక్ యువర్ సీట్స్" అంటూ ఇద్దరికీ కుర్చీలు చూపించాను.

అమాయకమైన కళ్ళతో డిస్పెన్సరీని కలయజూస్తూ తలదించుకొని కూర్చుంది. చూడముచ్చటగా వుంది జంట అనిపించింది. అతను దేనికో సంశయిస్తున్నాడని గ్రహించాను.

"చెప్పండి !" అన్నాను అతనిలోని సంశయాన్ని పోగొడుతూ.

"ఒకసారి ఈమెను పరీక్షించాలి" అన్నాడు అదోలా.

"ఏమైంది ?"

"నెలరోజులుగా నలతగా వుంటూంది."

"లోనికి రండి టెస్ట్ చేస్తాను" అన్నాను ఆమెనుద్దేశిస్తూ.

నా వెంట ఆమెకూడ లోనికి వచ్చింది. భయం భయంగా నా వంక చూస్తూ బెడ్‌మీద పడుకుంది.

ఆమె కళ్ళలోని బిత్తర చూపులు గమనించిన నేను —

"ఫర్వాలేదు దీనిలో భయపడాల్సిందేమి లేదు" అన్నాను టెస్టింగ్ బెడ్‌మీద పడుకున్న ఆమెలో భయాన్ని పోగొట్టాలని.

ఆమె పడుకున్న తీరును గమనించిన నాకు ఆమెమీద నా మాటలు పని చేశాయనిపించింది.

పరీక్షించిన నాకు కేసేమిటో వెంటనే అర్థమయింది. ఎక్కడలేని విసుగు, కోపం నాలో చోటు చేసుకున్నాయి. కాని ఏమని నిందించను. ఎవరని హితబోధ చేయను.

"వెరీ బాడ్ మిస్టర్ !... షి యీజ్ ప్రెగ్నెంట్ నౌ."పరీక్ష ముగించి బయటకు వచ్చి అతనితో అన్నాను. నా గొంతు నాకే వింతగా తోచింది.

"అయామ్ సారీ డాక్టర్ ! అనుకోని పరిస్థితులలో బలహీనతకు లొంగిపోవాల్సి వచ్చింది. త్వరలో పెళ్ళి చేసుకోబోతున్నాము. ఈ ఆపద నుండి మమ్ములను మీరే గట్టెక్కించాలి" అన్నాడు.

"అంటే ? ..." ప్రశ్నించాను మత్తు నుండి అప్పుడే తేరుకున్నట్లుగా.

"డాక్టర్, ఆమెకు ఎబార్షన్ చేయించాలి" అన్నాడు అతను.

"నో మిస్టర్! ఎలాగూ మేరేజ్ చేసుకోబోతున్నారు. అదేదో సాధ్యమైనంత త్వరలో కానిస్తే సరిపోతుంది."

"లేదు డాక్టర్, కొన్ని బాధ్యతలు నెరవేర్చ

వలసి వున్న దృష్ట్యా మరి కొంత కాలం ఆగక తప్పదు.''

''సారీ మిస్టర్, యు కెన్ గో.'' అన్నాను విసురుగా.

''ప్లీజ్ డాక్టర్. ఒక సాటి స్త్రీగా నా కోసం సాయం చేయరూ?'' అంది అప్పటి వరకు తల దించుకుని కూర్చొన్న ఆమె. ఆమె కళ్ళలో దైన్యం దోబూచులాడుతూంది.

ఆమె అభ్యర్థన నా మనసులో ఏ మూలో దాగిన మానవతా భావాన్ని మేలుకొల్పగా ఆమె కష్టాన్ని తలచుకున్న నేను కాదనలేకపోయాను.

ఎబార్షన్ ఎంత చట్టబద్ధమైనప్పటికి అది ఏ దిశగా పయనిస్తోందో చూస్తున్న నాకు క్షణకాలం వృత్తి మీద ఏహ్యాభావం కలిగించిందనటం అతిశయోక్తి కాదు.

''ఓ. కె. మీ యిష్టం. ఈ రోజు ఒక ఇంజెక్షన్ ఇస్తాను రేపు ఇదేటయిముకు వచ్చి కలవండి'' అన్నాను.


''ఈ రోజు చేయలేనంటారా?'' అడిగాడు

''చెయ్యవచ్చు కానీ ఎక్కువ టయిము తీసుకుంటుంది.''

''అంటే !''

''ఈ రాత్రికి క్లినిక్‌లో వుండి రేపు వెళ్ళవలసి రావచ్చు.'' అన్నాను.






''లేదు డాక్టర్! రాత్రిలోపు వెళ్ళిపోవాలి. పెద్ద వాళ్ళకు తెలియకుండా వుండాలి.'' అంది ఆమె.

వారి పరిస్థితి అర్థమయింది—

''సరే, సాయంత్రానికి పంపటానికి ప్రయత్నిస్తాను.''

''థాంక్యూ డాక్టర్.'' అన్నాడు అతను ఎంతో రిలీఫ్‌గా.

రెండు, మూడు గంటలలోపు తతంగం పూర్తి అయింది. ఆమెకు అరగంట తర్వాత తెలివి వచ్చింది. సాయంత్రం వరకు బెడ్‌రెస్ట్ తీసుకున్నాక ఇద్దరూ వెళ్ళిపోయారు.

అంతే !

మళ్ళీ ఇన్నేళ్ళకు... అదీ ఆమెను ఈ విధంగా చూడటం...

* * *

''ఏమ్మా! అలావున్నావు ? '' అడిగింది పెద్దమ్మ నా మొహంలోకి చూస్తూ.

నా పరధ్యానం ఆమెను తెలియని ఆందోళనకు గురిచేసింది. అది గ్రహించి ''ఏం లేదమ్మా! తమ్ముడేడి. కనుపించడేం?'' అన్నాను వర్తమానంలోకి తొంగిచూస్తూ.

''పొలంలో ఎరువులు చల్లించాలని ఉదయమనగా వెళ్ళాడమ్మా! బహుశ వస్తూండవచ్చు'' అంది అమ్మ.

నా మనసు నిలువనీయటం లేదు.

ఇప్పుడేం చెయ్యాలి ? ఇలా జరిగిందేమిటి ?? నా కర్తవ్యమేమిటి ??? నాలోని ప్రశ్నల పరంపర నాకు ఊపిరి సలుపనీయటం లేదు.

తమ్ముడికి యీ విషయం తెలియజేస్తే ! నాలోని ఆడమనసు పురికొలిపింది, ఛా !... ఏమిటీ ఆలోచన ? అంతలోనే మందలించింది నా వృత్తి ధర్మం.

నాలోని సంస్కారానికి, వృత్తి ధర్మానికి మధ్య సంఘర్షణ.

చాలా సమయాల్లో మనిషి సరిదిద్దవలసి వుండి కూడ చేతులు ముడుచుకొని ఎందుకుండిపోతాడో నాకు యిప్పుడే అర్థమయింది.

# వక్రరేఖ

పోనీ ఆమెను అడిగితే ! ఏమని చెబుతుంది· ఈ సంఘంలో తనూ ఓ ఆడది. మేకవన్నె పులులుంటాయని, నాగరికపు ముసుగులో తోడేళ్ళు సంచరిస్తుంటాయని తెలుసుకున్నానంటుందా. చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకోకపోయినా ఓ చల్లని చెట్టు నీడ సేద తీర్చుకుంటున్నానంటుందా ! ఏమని చెప్పగలదు ?

నా వ్యక్తిత్వం ముందు నిలిచి నన్ను వెక్కిరిస్తూంది.

''శాంతీ ! ప్రయాణం చేసి అలసిపోయినట్లున్నావు. స్నానంచేసి విశ్రాంతి తీసుకో'' అంటూ—

''వదినకు స్నానానికి నీళ్ళు ఏర్పాటుచేయి'' అంటూ ఆమెకు పని పురమాయించింది పెద్దమ్మ.

అంతవరకు ఇల్లు సర్దటంలో బిజీగా వున్న ఆమె ముఖ కవళికల్ని గమనించలేకపోయాను.

బాత్‌రూములో నీళ్ళు ఏర్పాటుచేస్తున్న ఆమె ముఖం వంక చూశాను. ఎటువంటి భయసంకోచాలు ఆమె ప్రవర్తనలో కనుపించకపోవటంతో ఆమె ధైర్య స్థయిర్యాలకు అచ్చెరువొందాను.

ఏమాత్రం నా వునికిని గుర్తించనట్లు ప్రవర్తించటంతో ఆమె నటనా సామర్ధ్యాన్ని తక్కువగా అంచనా వేయలేకపోయాను.

ఆమె నన్ను పట్టించుకోకపోవటంతో నాలోని అహం దెబ్బతింది. ఆమె జీవితం నాశనం కావటం నా మనస్సుకంగీకారం కాకున్న నన్ను ఆమె గుర్తించాలన్న తపన నాలో చోటు చేసుకుంది.

''ఏమ్మా ! నన్ను గుర్తించావా ?'' అడిగాను. నా గొంతు నాకే అసహజంగా తోచింది.

ఆమె చేస్తున్న పనిని మధ్యలో ఆపి దిగ్గున తల ఎత్తింది.

పాలిపోయిన మొహంతో, వర్షిస్తున్న కళ్ళతో బేలగా నా వంక చూస్తుందన్న నా వూహ తారుమారయింది.

ఆమె కళ్ళలో ఆశ్చర్యం, అనుమానం తొంగి చూస్తున్నాయి.

''క్షమించండి ! తొలిసారిగా చూస్తున్న మిమ్మలను గుర్తించటమేమిటి ?!'' అర్థం కానట్లు అడిగింది ఆమె.

ఆమె ప్రశ్నతో ఈసారి ఆశ్చర్యపోవటం నా వంతయింది. వంచనా శిల్పంలో ఆమె ఆరితేరిందని తెలుసుకున్న నాకు అంత సులువుగా ఆమెను వదలాలనిపించలేదు.

''హైదరాబాదులో మిస్టర్ సాగర్‌తో కలిసి నా డిస్పెన్సరీలో తీసుకున్న ట్రీట్‌మెంట్‌ను ఇంత త్వరగా మరుస్తావనుకోలేదు'' అన్నాను ఆమెను ఎలాగయినా దెబ్బకొట్టాలన్న తలంపుతో.

''సారీ మేడమ్ ! హైదరాబాదులో సాగర్ బావగారు, అక్కవున్న మాట వాస్తవమయినా నేను ఇంతవరకు హైదరాబాదు రావటం తటస్థించలేదు. బహుశ కవలలమైన మా అక్కగారిని మీరు చూసివుండవచ్చు'' అంది ఆమె.

మరోసారి ఆశ్చర్యపోవటం నా వంతయింది. ★

## మధనం

క్షీరసాగర మధనంలో
హాలా హలం
తరువాతే
అమృతం
పుట్టినట్లు
జీవన సాగర మధనంలో
చెడు తరువాతే
మంచి పుడుతుంది
క్రాంతి తరువాతే
'సత్తు' పుడుతుంది

— "సింహం"